క్లుప్తంగా

అన్నదాన భవన నిర్మాణానికి విరాళాల అందజేత



దేవస్థానం సిబ్బందికి నగదు అందిస్తున్న దాతలు

కాళ్ల: మండలంలోని కాళ్లకూరు గ్రామంలో ఉన్న స్వయంభూ శ్రీ వేకటేశ్వరస్వామి దేవస్థానం అన్నదాన భవనానికి విరాళాలు అందించినట్లు దేవస్థానం ఈవో మోకా అరుణ్ కుమార్ బుధవారం తెలిపారు. భీమవరానికి చెందిన డాక్టర్ రాయసం నరేశ్, సుధ దంపతులు, కుమారులు సంజయ్, రుద్రాష్‌లు రూ.1,25,000, అదేవిధంగా హైదరాబాద్‌కు చెందిన రుద్రరాజు నిరంజన్ బాలాజీవర్మ, రమాదేవి దంపతులు రూ.50 వేలు అన్నదాన భవననిర్మాణానికి విరాళం అందించినట్లు ఈఓ తెలిపారు. ఈసందర్భంగా దాతలకు ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి ప్రతిమతో సత్కరించామని వివరించారు.

మానసిక వైద్యశాలల సందర్శన



రోగులతో మాట్లాడుతున్న జడ్జి రత్నప్రసాద్

భీమవరం: పట్టణంలోని మానసిక వైద్యశాలలను బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కె.రత్నప్రసాద్ సందర్శించారు. వర్మ హాస్పిటల్స్, శాంతి, ప్రశాంతి మానసిక వైద్యశాలలను సందర్శించి రోగుల మానసిక స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోగులకు న్యాయపరమైన సూచనలు, సలహాలు అవసరమైతే స్థానికంగా ఉన్న మండల న్యాయ సేవా సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సహాయాన్ని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వర్మ హాస్పిటల్స్ మానసిక వైద్యురాలు శ్రీదేవి, శాంతి మానసిక ఆసుపత్రి వైద్యుడు జీవీ రమణరావు, ప్రశాంతి మానసిక ఆసుపత్రి వైద్యుడు మాదిరెడ్డి వెంకటరమణ పాల్గొన్నారు.

దళిత, మైనార్టీలపై పోలీస్ జులుం దారుణం



సుందర్‌కుమార్

ఉండి: తెనాలి ఐతానగర్‌లో ఇటీవల దళిత, మైనార్టీ యువకులపై పోలీసులు వ్యవహరించిన తీరు దారుణమని, రాష్ట్రంలో రాజ్యాంగ ఉల్లంఘనలు, పోలీస్ రాజ్యం నడుస్తుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి, న్యాయవాది జి.సుందర్ కుమార్ మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన వీడియో చూస్తే రాష్ట్రంలో పోలీసు పాలన ఎలా ఉందో? అర్థం అవుతుందని పేర్కొన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న సీఐ, కానిస్టేబుళ్లపై కూటమి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎన్‌టీఆర్‌కు ఘన నివాళి

భీమవరం/భీమవరం(ప్రకాశం చౌక్): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్‌టీ రామారావు జయంతిని రాజకీయం చేశారు. ఎన్‌టీఆర్ జయంతిని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించాలని అధికారులు ఉత్తర్వులు జారీచేయడంతో గతంలో ఎన్నడూలేని విధంగా బుధవారం భీమవరం పట్టణంలోని ప్రభుత్వకార్యాలయాలు, గ్రంథాలయాల్లో సైతం జయంతి వేడుకలు నిర్వహించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అలాగే వైఎస్సార్ శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఎస్ వెంకటేశ్వరరావు చిన్నపిల్లల సమక్షంలో వేడుకల నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశం మందిరంలో ఎన్టీఆర్ చిత్రపటానికి కలెక్టర్ సీహెచ్ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కాళ్లలో..

కాళ్ల: ఎన్టీఆర్ జయంతి వేడుకలు కాళ్ల మండలంలో నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. పెదఅమిరం, కాళ్ల, దొడ్డనపూడి, ఆనందపురం, ఏలూరుపాడు, కోపల్లె, సీసలి, కలవపూడి గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ నడింపల్లి భారతి విజయలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం ఎన్టీఆర్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రఘు, ఆదిశేషయ్య, రాఘవ రాజు పాల్గొన్నారు.

ఆహార పదార్థాల పంపిణీ

పెనుగొండ: అక్షయపాత్ర ఆధ్వర్యంలో వడలి ఎన్టీఆర్ కూడలి వద్ద బుధవారం ఆహార పదార్థాలు పంపిణీ చేశారు. పెనుగొండలో చొప్పెర్ల వెంకన్న బాబు నివాసంలో జరిగిన కార్యక్రమంలో మిగిలిన ఆహార పదార్థాలను అక్షయ పాత్ర సభ్యులు సేకరించి పంపిణీ చేశారు. ఉప్పలపాటి చంటి, తొంటా మహేష్, వెలిచేటి శ్రీను పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం కనుమరుగు

- కూటమి ప్రభుత్వంలో కుంటుపడిన పల్లె పాలన
- సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసిన వైనం



భీమవరం మండలం శ్రీరామపురంలో నిర్మించిన రైతుభరోసా కేంద్రం



వీరవాసరం మండలం నవుదూరు గ్రామంలో నిర్మించిన గ్రామ సచివాలయం

భీమవరం: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో భీమవరం నియోజకవర్గంలో పల్లె పాలన కనుమరుగైంది. సూపర్ సిక్స్‌తో పాటు ఇబ్బడిముబ్బడిగా సంక్షేమ పథకాలు అమలు చేయడమే గాక అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామంటూ ఎన్నికల్లో హామీలిచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఉన్న వ్యవస్థలను నిర్వీర్యం చేసే పనిలో పడ్డారు. ముఖ్యంగా సచివాలయ వ్యవస్థతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ స్వరాజ్యాన్ని ఆచరణలోకి తీసుకొచ్చింది. గ్రామ సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలతో గ్రామ స్థాయిలోనే ప్రభుత్వ కార్యాలయాలకు సొంత గూడు ఏర్పడింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో భీమవరం నియోజకవర్గంలో 58 సచివాలయ భవనాలను మంజూరుచేసి ఒక్కో భవనం నిర్మాణానికి రూ. 40 లక్షల చొప్పున మంజూరు చేశారు. అలాగే 22 విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను నిర్మించాలని ప్రతిపాదించి ఒక్కో భవనం నిర్మాణానికి రూ. 25 లక్షలు, 41 రైతుభరోసా భవనాల నిర్మాణానికి ఒక్కొక్క భవనం నిర్మాణానికి రూ. 22 లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారు. వీటిలో 47 సచివాలయ భవనాలు, 28 రైతు భరోసా కేంద్రాల భవనాలు, రెండు హెల్త్ క్లినిక్ భవనాలు నిర్మాణం పూర్తి చేశారు. మిగిలిన భవనాల నిర్మాణం సమయానికి ప్రభుత్వం మారిపోవడంతో పనులు నిలిచిపోయాయి. కనీసం మధ్యలో నిలిచిన పనులను పూర్తి చేయడానికి కూడా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో ఇదేం పాలన? అంటూ ప్రజలు పెదవి విరుస్తున్నారు.

ఆకివీడు నియోజకవర్గంలో ఇలా..

ఆకివీడు నియోజకవర్గంలో స్వాతంత్ర్యం విచ్చిన దగ్గర నుండి కొన్ని దశాబ్దాల పాటు గ్రామ పంచాయతీలకు స్వంత గూడు కరువైంది. గత పాలకులు పంచాయతీలకు సొత భవనాల నిర్మాణంలో తీవ్ర నిర్లక్ష్యం వహించారు. పూరి గుడిసెల్లోనూ, అద్దె భవనాల్లోనూ, రేకు షెడ్లలో, అయ్యవార్ల వరండాల్లో కూడా పంచాయతీ సమావేశాలు నిర్వహించిన దాఖలాలున్నాయి. వాటన్నింటికీ స్వస్తి చెప్పి 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత నియోజకవర్గంలో 62 సచివాలయాల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశారు. వాటిలో 40 పూర్తి చేశారు. మిగిలినవి నిర్మాణ దశలో ఉన్నాయి. నియోజకవర్గంలో 38 ఆర్బీకేల నిర్మాణానికి అనుమతి మంజూరు చేయగా 24 పూర్తి చేశారు. 28 విలేజ్ క్లినిక్‌లు మంజూరు చేయగా 12 నిర్మాణం పూర్తి చేసుకుని ప్రజలకు సేవలందిస్తున్నాయి. అయితే నిర్మాణం మధ్యలో ఆగిని కార్యాలయాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

ప్రజల ఆశలు నిర్వీర్యం



కూటమి ప్రభుత్వం ప్రజల ఆశల్ని నిర్వీర్యం చేసింది. జగనన్న పాలనలో ప్రజలు సంతోషంగా జీవించారు. ఆర్థిక ఇబ్బందులు లేవు. సంక్షేమ పథకాలతో ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగు పడింది. ప్రభుత్వం మారింది. ప్రజల చేతుల్లో చిల్లిగవ్వలేదు. పేద, మధ్యతరగతి ప్రజల ఆర్థిక ఇబ్బందులు వర్ణనాతీతం. అమ్మ ఒడి, ఫీజురీయంబర్స్‌మెంట్, రైతుభరోసా, మహిళలకు చేయూత, 45 ఏళ్లు దాటిన బీసీ, ఎస్సీ, ఎస్టీలకు పింఛన్ లేదు. మా ఇద్దరు పిల్లలకు అమ్మ ఒడి రాలేదు. ఎప్పుడు ఇస్తారో తెలియదు.

– అన్నెపు ఆంజనేయులు, పెదకాపవరం

చేయూత ఏదీ చంద్రబాబూ?



ఎస్సీ, బీసీ, మైనార్టీ, ఎస్టీ మహిళలు 45 ఏళ్లు దాటితే పింఛన్ ఇస్తానన్నారు. మహిళలకు నగదు ఇస్తానన్నారు. ఏమీ చేయలేదు. గతేడాది కాలంగా ఒక్క పథకం అందక ఆర్థికంగా నలిగిపోతున్నాం. కరెంట్ ఛార్జీల మోతతో ఇబ్బందులు పడుతున్నాం. సచివాలయ వ్యవస్థతో పరిపాలన గ్రామాల్లో సందడిగా, పారదర్శకంగా జరిగేది. ఇప్పుడు అదిలేదు.

– బి.మధు, మొగల్లు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమవరం అర్బన్: మండలంలోని యనమదుర్రు-దిరుసుమర్రు గ్రామాల మధ్య జీఎస్‌వీ కెనాల్ పూడిక పనులు జరుగుతున్న నేపథ్యంలో గురువారం దిరుసుమర్రు, కట్టావారిపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గొల్లవానితిప్ప విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని దిరుసుమర్రు, కట్టావారిపాలెం, ఆ ప్రాంత ఇండస్ట్రీయల్ లైన్ల వినియోగదారులకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరా ఉండదని స్పష్టం చేశారు.

మృతుని కుటుంబానికి నిత్యావసరాల అందజేత



రవి కుటుంబానికి సహకారం అందిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు

ఉండి: ఇటీవలే పొట్టకూటి కోసం వెళ్లి విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందిన బొజ్జ రవి కుటుంబానికి ఉండికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు అండగా నిలిచారు. బుధవారం హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు ఉండిలోని రవి కుటుంబాన్ని పరామర్శించి నెలకు సరిపడా నిత్యావసరాలు, కొంతమేర ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో కడగల యువసాయిరామ్, మణి, హర్షద్ అహ్మద్, నెల్లి ప్రదీప్, మద్ది బాలసాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో మహిళకు గాయాలు

భీమవరం: పట్టణంలోని జువ్వలపాలెంలో రోడ్డులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాళ్ల మండలం కోపల్లె గ్రామానికి చెందిన జి.నాగమణి గాయపడింది. ఆమె భీమవరం పట్టణంలోని ఒక ల్యాబ్‌లో పని చేస్తుండడంతో విధి నిర్వహణ కోసం ఆమె యాక్టివా స్కూటర్‌పై వస్తుండగా వస్తుండగా మరొక మోటారు సైకిల్ ఢీకొట్టడంతో గాయాలపాలైంది. బాధితురాలు ప్రస్తుతం పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. బాధితురాలు నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ మోహన్‌రావు కేసు నమోదు చేస్తున్నారు.

మోటారుసైకిల్ ఢీకొని వ్యక్తికి గాయాలు

భీమవరం: స్థానిక టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని సంజీవయ్యనగర్‌లో మోటారు సైకిల్ ఢీకొనడంతో ఓ వ్యక్తి గాయపడినట్లు ఎస్సై రెహమాన్ చెప్పారు. పట్టణానికి చెందిన ఎం.శేషగిరిరావు సైకిల్‌పై దేగాపురం వెళ్లి తిరిగి వస్తుండగా మోటారుసైకిల్ ఢీకొనడంతో గాయపడ్డాడు. బాధితుడు ప్రైవేటుఆసుపత్రిలో చికిత్స పొందుతూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రెహమాన్ చెప్పారు.

బెల్ట్ షాపు నిర్వాహకురాలి అరెస్ట్

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు నిర్వహించిన దాడుల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ మహిళను అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మండలంలోని దగ్గులూరు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఐవీ రమణ అనే మహిళను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఆమె వద్ద నుంచి 6 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

కొనసాగిన సిల్ట్ తొలగింపు పనులు

పాలకొల్లు సెంట్రల్: న్యూక్లాత్ మార్కెట్‌లో డ్రెయినేజీలో సిల్ట్ తొలగింపు పనులు రెండో రోజు బుధవారం కూడా కొనసాగాయి. షాపులు ముందు ఎవరికి వారే ఏర్పాటు చేసుకున్న పార్కింగ్ టైల్స్‌ను నిర్మూలన చేసి సిల్ట్‌ను తొలగించారు. గతంలో ఎప్పుడు ఈ ప్రాంతంలో డ్రెయినేజీలో సిల్ట్ తీయాలన్నా ఎవరికి వారే తమ షాపు వద్ద రాళ్లు తీయవద్దని ఒత్తిళ్లు తీసుకురావడంతో తూతూ మంత్రంగానే సిల్ట్‌ను తొలగింపు ఉండేది. నేడు ఆ పరిస్థితి లేకుండా షాపులు ముందు డ్రెయినేజీని పగులగొట్టి సిల్ట్‌ను తొలగించారు. ఈ ఒక్క రోడ్డులో సుమారు పది ట్రాక్టర్ల సిల్ట్ ఉంటుందని పారిశుద్ధ్య కార్మికులు చెబుతున్నారు. బుధవారం మునిసిపల్ కమిషనర్ బి.విజయసారథి డ్రెయినేజీ పనులను పరిశీలించారు.

2న ఇళ్ల స్థలాల కోసం ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న రంగారావు



ఉండిలో ధర్నా పోస్టర్ విడుదల చేస్తున్న సీపీఐ మండల కార్యదర్శి వెంకట్రావు

భీమవరం: ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వం ఇచ్చిన జీఓను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 2న తలపెట్టిన తహసీల్దార్ కార్యాలయాల ముట్టడి, ధర్నా కార్యక్రమాలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు పిలుపునిచ్చారు. బుధవారం ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏరియాలో నిర్వహించిన ఇళ్ల స్థలాల సాధన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామని కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలన్నారు. ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన హామీలు ఏడాది పాలనలో అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారని రంగారావు విమర్శించారు. కార్యక్రమంలో పోతుల యాకోబు, పాలా త్రిమూర్తులు, విజయ్, సత్యనారాయణ, నందీశ్వర రావు, పొలురాజు, రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలి

ఉండి: అర్హులైన పట్టణ పేదలకు రెండు సెంట్లు,గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని, సూపర్‌సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయాలని జూన్ 2న తహసీల్దార్ కార్యాలయాల వద్ద సీపీఐ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేరకు బుధవారం ఉండిలో మహాధర్నా పోస్టర్ విడుదల చేశారు. అనంతరం వెంకట్రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. సంక్షేమం అభివృద్ధి అని కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు సనపల శ్రీను, కోనా గొల్లయ్య, వీరన్నపల్లి పెద్దులు, తమరాని శ్రీనివాస్, వీరన్నపల్లి దుర్గయ్య, నార్లగంటి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

పెంచిన ఆస్తి పన్ను ఉపసంహరించుకోవాలి



సీపీఎం సమావేశంలో మాట్లాడుతున్న గోపాలన్

భీమవరం: పెంచిన ఆస్తి పన్ను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ డిమాండ్ చేశారు. బుధవారం భీమవరంలో ఎం.వైకుంఠరావు అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ఎన్నికల ముందు తాము అధికారంలో వస్తే ప్రజలపై ఎలాంటి భారాలు వేయమని, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చి ప్రజలపై ఆస్తి విలువ ఆధారంగా 20 శాతం పన్ను పెంచిందని మండిపడ్డారు. ఇప్పటికే పెరుగుతున్న ధరలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతుంటే రాష్ట్ర ఖజానా నింపుకోవడం కోసం ప్రజలపై ఆస్తి పన్ను భారం వేయడం దారుణమన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి పెంచిన ఆస్తి పన్నును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, డి.వరలక్ష్మి, సత్యనారాయణ, డి.నాగు, కె.కృష్ణ, డి.త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి వేతనాలు వెంటనే చెల్లించాలి



ఉపాధి కూలీలతో కలిసి నిరసన తెలుపుతున్న సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఇంజేటి శ్రీనివాస్

భీమవరం అర్బన్: ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు రెండు నెలలు గడుస్తున్నా నగదు చెల్లించకపోవడం దారుణమని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఇంజేటి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని పెదగరువు గ్రామంలో బుధవారం ఉపాధి హామీ కూలీ పనులు చేస్తున్న వారిని సీఐటీయూ సంఘం సభ్యులు కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రోజు వారి కూలీ రూ. 600, ఏడాదికి 200 పనిదినాలు పెంచాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇంజేటి శ్రీనివాస్‌లు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీ పనులు చేసిన 15 రోజుల్లోనే వేతనాలు చెల్లించాలని చట్టంలో ఉన్నా రెండు నెలలు గడుస్తున్నా వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో పట్టిం చిన్న యోహాను, పాలపర్తి చంద్ర పాలు, వజ్రమ్మ, మేడిది సత్యానందం, పాలపర్తి జ్ఞానరత్నం, ప్రభుదాసు, జయమణి తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌ను సక్రమంగా పంపిణీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఎన్.భారతి విజయలక్ష్మి

పాలకోడేరు: అధికారుల సూచనలు అనుసరించి, ప్రజలకు రేషన్ సరుకులను పంపిణీ చేయాలని పాలకోడేరు మండల తహసీల్దార్ భారతి విజయలక్ష్మి రేషన్ డీలర్లకు సూచించారు. బుధవారం ఆమె తన కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 1 నుంచి రేషన్ షాపుల ద్వారా కార్డుదారులకు నిత్యావసరాలు పంపిణీ చేయాలని అన్నారు. ఈపోస్ మెషీన్, కాటాలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఏమైనా రిపేర్లు చేయాల్సి వస్తే టెక్నీషియన్ అందుబాటులో ఉంటారని చెప్పారు. 65 ఏళ్లు దాటిన వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకే సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో సీఎస్ డీటీ ఆది శేషయ్య, మాణిక్యాలరావు, డీలర్ల సంఘం కార్యదర్శి సోము రామకృష్ణ, కొల్లా సత్యనారాయణ, సాంబ్రాణి పద్మజ, ఎస్ఎన్‌వీ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ సభ్యత్వానికి నోచుకోని అగ్నికుల క్షత్రియులు



వనువులమ్మ ఆలయ ప్రాంగణంలో మాట్లాడుతున్న అగ్నికుల క్షత్రియులు

ఆకివీడు: అగ్నికుల క్షత్రియ సొసైటీలో తమను సభ్యులుగా చేర్చుకోవడంలేదని పలువురు కుల సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక వనువులమ్మ వారి ఆలయ ప్రాంగణంలో బుధవారం విలేకర్ల సమావేశంలో అగ్నికుల క్షత్రియ కుల పెద్దలు కారాడి దుర్గారావు, వల్లభుని నాగరాజు మాట్లాడుతూ తమ పూర్వీకులు సొసైటీలో సభ్యులుగా ఉన్నారని వారు చనిపోయిన తరువాత వారసత్వంగా వస్తున్న వారిని సభ్యులుగా చేర్చుకోవడం లేదని వాపోయారు. సంఘంకు వచ్చే ఆదాయ వ్యయాలను తెలియజేడంలేదన్నారు. మీరు సభ్యులు కానందున మీకు చెప్పాల్సిన అవసరం లేదని వారు తమపై వ్యతిరేకంగా ఉన్నారని వాపోయారు. ఆధార్, రేషన్ కార్డులన్నీ ఇక్కడే ఉన్నా తమను పొరుగూరి వారిగా పరిగణిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సొసైటీ తరపున కమ్యూనిటీ హాలు నిర్మాణం జరిగిందని, కొంత సొమ్ము అప్పుజేసి కట్టారని, అద్దెలు, ఇతరత్రా ఆదాయ జమాఖర్చులు తెలపడం లేదన్నారు. సొసైటీ సభ్యులుగా కొత్తవారినందరినీ చేర్చుకోవాలని వారు డిమాండ్ చేశారు. కమ్యూనిటీ హాలు అభివృద్ధి కమిటీ, రథం కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. విలేకర్ల సమావేశంలో వనువులమ్మ దేవస్థానం ఛైర్మన్ పొన్నాల నాగమణి, పొన్నమండ కనకరాజు, చింత భానుచందర్, కారాడి శివ, పొన్నమండ పెద్దిరాజు, వనమాలి కృష్ణభగవాన్, పొన్నమండ పెద్దింట్లు తదితరులు పాల్గొన్నారు.

‘ఆ స్థలం జోలికి వెళ్లవద్దు’



విలేకరులతోమాట్లాడుతున్న హైకోర్టు లాయర్ అనురాధ

ఆకివీడు: స్థానిక అయిభీమవరం రోడ్డులో ఉన్న క్రిస్టియన్ సంస్థకు చెందిన భూమిలోకి ఎవరూ వెళ్లవద్దని, నగర పంచాయతీ, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగాన్నికి తెలియజేసినట్లు హైకోర్టు లాయర్ అనురాధ చెప్పారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ రెండు రోజుల క్రితం నగర పంచాయతీ సిబ్బంది వెళ్లి ఆ స్థలంలో పాక తొలగించే ప్రయత్నాలు చేసినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై కమిషనర్‌తో మాట్లాడితే కోర్టులో ఉన్న విషయం తనకు తెలియదని, ఇకపై ఆ స్థలం జోలికి వెళ్లమని చెప్పినట్లు ఆమె వివరించారు. సీబీసీ ఎన్‌సీ ఆంధ్ర బాప్టిస్టు సెంటినరీ చర్చి ఫాదర్, సంస్థ కార్యదర్శి గూడపాటి జోసఫ్‌రాజు మాట్లాడుతూ క్రేగ్ దొర తమ సంస్థకు 1891లో కేటాయించారని చెప్పారు. బ్రాంచి చర్చిగా తాము ఉపయోగిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఏసురాజు, ఏసేబు, యాకోబు, జోసఫ్, పమ్ము, శేఖర్ , ఎలీషా, ఆనంద్‌ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు



సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీవో దాసి రాజు

నరసాపురం: లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కాన్ సెంటర్‌లు, వైద్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని నరసాపురం ఆర్డీఓ దాసి రాజు హెచ్చరించారు. బుధవారం నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీఓ అధ్యక్షతన నరసాపురం సబ్‌డివిజనల్ లెవెల్ మల్టీ మెంబర్ అథారిటీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ పీసీపీఎన్‌డీటీ యాక్ట్ 1994 ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే స్కాన్‌సెంటర్‌లు సీజ్ చేస్తామన్నారు. మొదటిసారి తప్పుచేసిన వైద్యుల సర్టిఫికెట్‌ను భారత వైద్యమండలి నుంచి 5 సంవత్సరాలు తొలగించడం, 3 ఏళ్లు జైలు శిక్ష, రూ.50 వేలు ఫైన్ ఉంటుందన్నారు. అదే తప్పుచేసి రెండవసారి దొరికితే భారత వైద్యమండలి నుంచి సదరు వైద్యుడు ధ్రువీకరణ సర్టిఫికెట్‌ను శ్వాతంగా రద్దు చేయడంతో పాటు 5 ఏళ్ల జైలుశిక్ష, భారీ ఫైన్ పడుతుందని హెచ్చరించారు. స్కాన్ సెంటర్‌లపై సంబంధిత అధికారులు నిఘా ఉంచాలని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో ప్రసాద్, ఈగల్ ఎక్స్‌పర్ట్ చల్లా దానయ్య నాయుడు, వైద్యులు డాక్టర్ జెట్టి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

నరసాపురం: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు.